
# తేడా

న్యాయపతి కమలారాంజీ



**పెళ్లి సింపుల్‌గా జరిగిపోయింది. ఎక్కువమందిని పిలిచి అట్టే అట్టహాసం చెయ్యకుండా సునీతను పెళ్లి చేసుకున్నాడు చంద్రం.**

సత్యనారాయణవ్రతం చెయ్యడానికి మటుకు పెద్దవాళ్ల బలవంతం మీద సరేనని ఒప్పుకున్నాడు.

వ్రతం పూర్తయింది. వధూవరులిద్దరూ లేచారు. సునీత చీర కంటిన పసుపునీ, అక్షింతలనూ దులుపుకుంటూ భర్త వెనకే నడిచింది. పురోహితుడు తమలపాకులు, చెక్కలు, బియ్యం, అరటిపళ్లు, దక్షిణ వేటికవి వేరువేరుగా సర్దుకుంటున్నాడు. తాంబూలంలో నూటపదహార్లు పెట్టి పురోహితునికిచ్చి అతని కాళ్లకి దణ్ణం పెట్టాడు చంద్రం. సునీత కూడా భర్త తర్వాత వచ్చి పురోహితుని కాళ్లకి దణ్ణం పెట్టింది.

"దీర్ఘసుమంగళీ భవ!"

"శీఘ్రమేవ సుపుత్ర ప్రాప్తిరస్తు!" అని దీవించేదు ఆయన. ఇదంతా దూరంగా కూర్చుని చూస్తున్న సుభద్రమ్మగారి కళ్లు చెమ్మగిల్లేయి. పురోహితుడు సునీతని దీవించిన ఆ రెండు దీవెనలు చెవుల్లో పడగానే గుండెని ఎవరో మెలితిప్పినట్టయింది ఆమెకి. ఆవిడ మనసులో గతానికీ–వర్తమానానికీ మధ్య ఘర్షణ ప్రారంభమయింది!

"మామ్మగారూ! మమ్మల్ని దీవించండి."

చంద్రం, సునీత సుభద్రమ్మగారి కాళ్లకు దణ్ణం పెడ్తూంటే ఆవిడ సందిగ్ధంలో పడ్డారు. వాళ్లిద్దరూ కొత్తదంపతులు. జీవితంలోని కొత్తకొత్త రుచుల్ని చవిచూడబోతున్నవాళ్లు! వాళ్లిద్దర్నీ ఏమని దీవించాలి? ముఖ్యంగా సునీతని! పురోహితుడు దీవించినట్లేనా? ఆమె మనసు ఆమెని తిట్టిపోస్తోంది – "ఏమిటి ఆలస్యం? కాలంతో పాటు సర్దుకుపోవడం నేర్చుకో. నువ్వు ఒక్కర్తివీ దీవించకపోవడంవల్ల వాళ్ల కొచ్చే నష్టం అంటూ ఏమీ లేదు. కానీ మనసారా దీవించి నీ పెద్దరికం నువ్వు నిలబెట్టుకో" అని మనస్సు హెచ్చరిస్తూంటే అప్రయత్నంగానే ఆవిడ కుడి చేతిని ఎత్తి దీవిస్తున్నట్టుగా ఇద్దరి తలల మీదా నిమిరింది ఆప్యాయంగా. అది చాలు వాళ్లకి! కొన్ని భావాలకి భాష వుండదు. పండు టాకులా మిగిలిపోయిన ఆ ముసలావిడ మూగ ఆశీస్సులే పదివేలు వాళ్ళకి!

చంద్రం స్నేహితులంతా వచ్చారు. చంద్రంతో కరచాలనం చేస్తూ అతని వైవాహిక జీవితం శుభప్రదం కావాలని మనసారా కోరుతూ అతని త్యాగాన్ని పొగుడుతూ, అతని ఆదర్శాల అడుగుజాడల్లో ప్రతి యువకుడూ నడవాలని భావావేశాలతో చెప్పి మరీ వీడ్కోలు తీసుకున్నారు.

జరుగుతున్నదంతా ఒక కలలా వుంది సుభద్రమ్మగారికి. ఈ వాస్తవాన్ని ఆమె మనసు ఒక పట్టాన జీర్ణించుకోలేకపోతోంది. కానీ ఇది వాస్తవం. ఈ వాస్తవాన్ని తను స్వీకరించినా, లేక పోయినా ఇది ముమ్మాటికీ వాస్తవమే. తను పాతతరంమనిషి. ఆ కాలానికీ, ఈ కాలానికీ ఎంతో తేడా వుంది! రోజులు బాగా మారిపోయాయి. పాత తరానికి ప్రతినిధి తను! కొత్త తరానికి ప్రతినిధులు సునీత, చంద్రంలు! అప్పుడు పుట్టిన తను ఇప్పటిదాకా జీవించేవుంది. పాతకీ, కొత్తకీ మధ్య వారధిలా మిగిలిపోయింది తను!

మూడేళ్ల అజయ్, సునీత వెనక వెనకే తిరుగుతున్నాడు. ఆమె కొంగుపట్టుకొని ఒక్క క్షణం కూడా వదలడంలేదు. సునీత చాలా ఇరకాటంలో పడింది. ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ముందే ఊహించి చంద్రంతో చెప్పింది తను. "అజయ్‌ని... మన పెళ్లిరోజున ఇంకెక్కడైనా వుంచుదామంటే 'నా' అని చెప్పకోదగ్గ దగ్గరవాళ్లెవరూ నాకు లేరు. పోనీ వసంత దగ్గర వుంచేస్తాను. అసలు ఆ రోజు వాడు.. ఇక్కడ.. వుండకూడదు కూడా." ఆమెకి ఆ మాట చెప్పడానికి ఎంతో సిగ్గుతో కూడిన బెరుకులాంటిది కలిగింది.

సునీత మాటల్ని చంద్రం ఎంతమాత్రం ఒప్పుకోలేదు. ఖండించాడు.

"అదేం పనికిరాదు. వాడు ఇక్కడే వుంటాడు. ఆ రోజు! ఎవరు ఏమనుకున్నా అనుకోనీ. మనం మనకోసం పెళ్లి చేసుకుంటున్నాం. వాళ్లందరి కోసం చేసుకోవడంలేదు. ఆ రోజు అజయ్ వుండకూడదు అని రూలు ఎవడు రాసి పెట్టేడు చెప్పి? అలాంటి చాదస్తాలు ఇంక పెట్టుకోకు. నువ్వు నాదానివి అని నేనెప్పుడైతే అనుకున్నానో వాడు కూడా అప్పుడే నావాడైపోయాడు. అసలు మన పెళ్లికి ఎవర్నీ ఎక్కువమందిని పిలవడంలేదుగా. చాలా ముఖ్యమైన స్నేహితులు, మనం చేస్తున్న పనిని హర్షించి మనకి చేయూత నిస్తున్న వాళ్లూ అంతేగా.. నువ్వు మనసులో ఎలాంటి సందేహాలు పెట్టుకోకు.. అజయ్ సంగతి నాకు వదిలేయ్" అన్నాడు చంద్రం.


సునీత స్నేహితురాలు వసంత, సునీత పరిస్థితి గమనించి అజయ్‌ని బలవంతంగా ఎత్తుకుని, బుజ్జగించి అవతలకు తీసుకెళ్లింది. రెపరెపలాడే కళ్లల్లో వూరిన నీటి బిందువులు కను కొలకుల్లో చేరి ఆ లైటు వెలుతురులో తళుక్కున మెరిసేయి. ఆమె కృతజ్ఞతగా స్నేహితురాలి వైపు చూసింది.

సుభద్రమ్మగారికి ఆ దృశ్యం చూడగానే మనసు చివుక్కుమంది. వెంటనే సునీతని అక్కున చేర్చుకుని ఓదార్చాలనే భావన కలిగింది ఆ స్త్రీ హృదయంలో. కానీ ఆవిడ ఆ పని చెయ్యలేకపోయింది. చెయ్యడానికి మనసొప్పకకాదు, వాతం పట్టు పట్టిన కాళ్ళు వెంటనే లేవడానికి సహకరించక!

వారం రోజుల క్రితం జగన్నాథదాసు తన దగ్గర కొచ్చి చంద్రం పెళ్లి ప్రస్తావన ఎత్తినప్పుడు మొదట ఆవిడ నమ్మలేకపోయింది.

వాడు ఏమన్నాడు?...

"అమ్మా! నేను చెప్పింది నీకు నచ్చకపోవచ్చు. నిజం చెప్పాలంటే నాకే అదోలా వుంది. కానీ ఏం చేస్తాం? ఒక్కగానొక్క కొడుకు వాడు నాకు. వాడి సంతోషమే నా సంతోషం. చంద్రం చేసుకోబోయే అమ్మాయి భర్త అయిదేళ్ల క్రితం ఏక్సిడెంటులో చనిపోయాడట. అప్పట్నుంచీ ఆ అమ్మాయి, వున్న డిగ్రీ ఆధారంతో ఉద్యోగం సంపాదించుకుని చంద్రం ఆఫీసులోనే పని చేస్తోందట. ఆ అమ్మాయికి మూడేళ్ల బాబు కూడా వున్నాడట! ఆ అమ్మాయికి భర్తగా, ఆ బాబుకి తండ్రిగా తను జీవితాంతం ఆమెకు తోడూ, నీడగా వుంటానని వాగ్దానం చేసాడట. జీవితంలో నలువైపులా




చీకటి మూసుకుపోయినప్పుడు ఆత్మీయతాభిమానాలను పోగొట్టుకుని మానసికంగా కృంగిపోతున్న అలాంటి అమ్మాయికి 'నేనున్నాను' అంటూ ధైర్యం చెప్పి చేయూత నివ్వడం నిజంగా గొప్ప ఆదర్శం. అది మనందరికీ గర్వకారణం. నాకు నిజంగా చాలా సంతోషంగా వుందమ్మా. శిథిలమైపోయిన ఆమె జీవితంలో చిరుదీపం వెలిగించడానికి సంప్రదాయపు ఉక్కు సంకెళ్లని తెంచుకునే శక్తి, సమాజపు ఒత్తిడులకు తట్టుకుని ఎదురు నిలువ గలిగే గుండెనిబ్బరం ఆ భగవంతుడు నా కొడుక్కి యిచ్చినందుకు నేను నిజంగా గర్వపడుతున్నానమ్మా. నిజంగా గర్వపడుతున్నాను" అన్నాడు వెర్రినాగన్న! వాడలా ఆవేశంతో అంటున్నప్పుడు వాడి కళ్లల్లో తడి ఆవిడ దృష్టిని దాటిపోలేదు.

అంత పెద్దవాడయిపోయి రేపోమాపో రిటైరైపోయే స్టేజి కొచ్చేసిన తన కొడుకుని ఆ రోజు మొట్టమొదటిసారిగా చాలా చిత్రంగా చూసింది ఆవిడ!

ఆ నిజం జీర్ణించుకోవడానికి ఆమెకి కొన్ని నిమిషాలు పట్టింది. రెండు విరుద్ధభావాల మధ్య కొట్టుకుంటూన్న హృదయాన్ని అదుపులో పెట్టుకుని నిర్లిప్తంగా నవ్వింది ఆవిడ.

"అమ్మా. నీ మనసుని వాడు నొప్పిస్తున్నాడు కదా" కొడుకు మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ సుభద్రమ్మగారు అంది.

"లేదు జగన్నాథం.. కాలం మారిపోయింది. కాలంతో పాటూ మనమూ మారాలి. వాడు చేస్తున్న పనిని మనం హర్షించాలి." ఆవిడలా అందే కానీ జగన్నాథదాసు తృప్తి కోసం ఆ మాటలంది. కొడుకు వెళ్లిపోయిన తర్వాత చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయింది.

** ** ** చిన్నారి అజయ్ వసంత దగ్గర వుండకుండా ఒకటే ఏడుపు మొదలెట్టాడు. అక్కడున్న వారంతా సునీత వైపు, అజయ్‌వైపు మార్చి మార్చి చూడ్డంతో ఆమె వదనం కుంచించుకుపోయింది. ఏదో తప్పు చేసినట్టు గిల్టీగా ఫీలవసాగింది. స్నేహితులతో మాట్లాడుతూ ఒక కంట ఇదంతా గమనిస్తున్న చంద్రం పరుగు పరుగున వచ్చి అజయ్‌ని ఎత్తుకుని అవతలకు తీసుకెళ్లాడు.

"అంకుల్. అంకుల్ నాకు చాక్‌లెట్లు కొంటావా? అమాయకంగా, ముద్దుముద్దుగా అడుగుతున్న ఆ చిన్నారిబాబుతో చంద్రం అంటున్నాడు నెమ్మదిగా.

"అంకుల్ కాదు బాబూ డాడీ అనాలి. ఏదీ డాడీ అనిపిలువ్."

"హాయ్ డాడీ డాడీ" చప్పట్లు కొడ్తున్నాడు పసివాడు.

చంద్రం పసివాణ్ణి ఎత్తుకుని మాటలతో మురిపిస్తున్న దృశ్యం చూడగానే సుభద్రమ్మగారు ఆలోచనల్లోంచి తేరుకుంది.

"అత్తయ్యగారూ! మీరు అలా గదిలోకి పదండి. ఈ హాలు తుడిచేస్తే విస్తళ్లు వెయ్యాలి." అంటూ అలివేలు వచ్చి అత్తగారిని సాయంపట్టి లోపలికి తీసుకెళ్లి మంచం మీద పడుకోబెట్టింది.

సుభద్రమ్మగారికి చంద్రం పెళ్లి చాలా వింతగా, ఆశ్చర్యంగా తోచసాగింది. ఎంత మనసుకి సమాధానం చెప్పకుందామన్నా అదేమిటో ఆవిడ మనసులో చెప్పలేని వెలితి ఏర్పడసాగింది. ఆమె మనసు చాలా లోతుగా ఆలోచిస్తోంది.

గతం తాలూకు జ్ఞాపకాలు కందిరీగల్లా ఆమె మనసున ముసురుకున్నాయి. ఆమెకు చాలా వింతగా తోస్తున్న విషయం ఒకే ఒక్కటి, అదే గతానికీ వర్తమానానికీ మధ్య నున్న తేడా!

పందొమ్మిది వందల నలభైకీ ఎనభైకీ మధ్య నున్న తేడా!

ఆనాటి చూడామణి పెళ్లికీ—ఈనాటి చంద్రం పెళ్లికీ తేడా!

అప్పటికీ—ఇప్పటికీ సంప్రదాయపు విలువల్లోనూ—సామాజిక వ్యవస్థలోనూ ఎన్నో మెచ్చుకోదగ్గ మార్పులు వచ్చాయి. గతం ఆమె కళ్లముందు సినిమా రీలులాగ కదుల్తున్నాది...

** ** **

కొన్ని సంవత్సరాల క్రిందట అంటే పందొమ్మిది వందల నలభై సంవత్సరం నాటికి తను ఆయిదుగురు పిల్లల తల్లి! అందరిలోకీ పెద్దవాడు జగన్నాథదాసే. తర్వాత వాళ్ళు నలుగురూ ఆడపిల్లలు. పుట్టిల్లూ—అత్తవారిల్లూ ఒక వూరే కావడం వల్ల సుభద్రమ్మగారు పిల్లల్ని తీసుకుని మాటిమాటికి పుట్టింటికెళ్లి వస్తూ వుండేది. అత్తవారింట్లో కంటె పుట్టింట్లో మడీ, ఆచారం మరీ ఎక్కువ. పరమ ఛాందస భావాలు వాళ్ళవి. నిప్పుల్తో చేతులు కడుక్కునే రకాలు. పుట్టింటికి వెళ్లినప్పుడల్లా పిల్లలు విధిగా పొత్తి పంచెలు కట్టుకుని భోంచెయ్యాల్సిందే. పిల్లలు పెద్దయ్యాక ఆ పొత్తి పంచెలకి భయపడి "అమ్మమ్మ వాళ్లింటికి మేం రాము. నువ్వే వెళ్ళు" అని తప్పించుకునేవారు. ఏ పండగ వచ్చినా, పుట్టినరోజు వచ్చినా, ఏ చిన్న వేడుకైనా సరే సుభద్రమ్మగారి తల్లి ఆండాళమ్మగారు కూతుర్నీ, అల్లుడ్నీ, పిల్లల్నీ భోజనానికి పిల్చేవారు. కానీ సుభద్రమ్మగారి భర్త రామానుజస్వామిగారికి అత్తగారి వైఖరి అంతగా నచ్చదు. మావగారి మడీ, ఆచారం అంతకంటె నచ్చదు. అందుకే ఆయన భోజనాలకి పిలిస్తే వెళ్ళేవారు కాదు. ఏదో మిష పెట్టుకుని వుండిపోయేవారు. సుభద్రమ్మగారిని మాత్రం పంపించేవారు. పుట్టింటివాళ్ళు ఎలాంటివాళ్లైనా వాళ్ళని పల్లెత్తు మాట అననివ్వదు ఆడది. ఎవరైనా ఏమైనా తన పుట్టింటి వాళ్ళమీద అంటే ఎక్కడలేని రోషం ముంచుకొచ్చేస్తుంది ఏ ఆడదానికైనా. రామానుజస్వామిగారు సమయం దొరికితే చాలు సుభద్రమ్మగారిని ఏదో ఒక మాట మీద దెప్పిపొడిచేవారు.

"మీ అమ్మ ఇలాగ, మీ అక్కగారు అలాగ" అంటూ. ఆవిడకి రోషం, దుఃఖం రెండూ ముంచుకొచ్చేవి. అతనితో వాదనకి దిగేది. ఆయన పెళ్ళాన్ని కాస్సేపు ఏడిపించి తర్వాత నవ్వుకుంటూ "సర్లే అన్నింటికి ఏడ్చుకోకు. ఉన్న మాట అన్నాను. ఉన్నమాటంటే ఉలుకట" అనేవారు.

ఒకసారి సుభద్రమ్మగారు ఏదో సందర్భంగా పుట్టింటికి భోజనానికి వెళ్ళారు. ఆ రోజు ఆవిడ ఇంట్లోంచి బయలుదేరేటప్పటికి చిన్నచిన్న చినుకులు పడడం మొదలైంది. ఆ చిన్న చినుకులే కొస్త పెద్దవిగా మారి టప్‌టప్‌మని రాళ్ళు తగిలినట్టుగా ముఖానికి తగుల్తున్నాయి. ఉరుములు—మెరుపులు భయంగొల్పుతున్నట్టుగా వున్నాయి. ఈదురుగాలి ఈడ్చికొడ్తోంది. "ఇంత వర్షంలో ఏం వెళతావు?" అన్నా వినకుండా మొహంమీద పడే వర్షపు చినుకుల్ని లెక్కచేయకుండా బయలుదేరింది ఆవిడ.

ఆవిడ వెళ్లిన కొంతసేపటికి రామానుజస్వామిగారు బీరువా తాళాలకోసం చూస్తే తాళం కనిపించలేదు. అంతా వెతికారు. ఎక్కడా కనబడలేదు.

"మీ అమ్మ బీరువా తాళం ఎక్కడ పెట్టిందో కనుక్కురారా జగన్నాథం. వర్షం పడ్తున్నది. గొడుగేసుకుని వెళ్ళు" అని కొడుకును పంపించారు ఆయన.

జగన్నాథం వెళ్ళేసరికి అక్కడ ఎదురుగా కనబడ్డ దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. అప్పటికింకా చిన్నవాడే అయినా తన తల్లికేదో అవమానం జరిగిపోతున్నదని మాత్రం పసిగట్టాడు.

ఆండాళమ్మగారు కూతురికి వంటింట్లో కాకుండా నడవలో విస్తరాకు వేసి భోజనం వడ్డిస్తున్నారు. ఆవిడ బుర్ర వంచుకుని భోంచేస్తున్నది. మిగతా వాళ్ళు వంటింట్లోనే భోంచేస్తున్నారు. సుభద్రమ్మగారు తలెత్తి చూడగానే కొడుకు ఎదురుగా

## డా॥ కె. కిరణ్ కుమార్

కనిపించాడు. ఆవిడ గతక్కుమంది. తాళం అడిగి పుచ్చుకుని ఎవరో తరుముకు వస్తున్నట్టుగా వెంటవెంటనే వచ్చేశాడు జగన్నాథం. జరిగినదంతా తండ్రితో చెప్పేసరికి ఆయన అగ్గిమీద గుగ్గిలంలా మండిపడసాగాడు. అక్కడతో ఆగక సుభద్రమ్మగారు ఇంటికి రాగానే నిలదీసి అడిగారు.

"ఎన్నాళ్ళయి సాగుతున్నాది ఈ వ్యవహారం?"

"ఏ వ్యవహారం?" అంది ఆవిడ లోలోపల భయపడుతూనే.

"నంగనాచిలా మాట్లాడకు. ముష్టివాళ్ళకు అన్నం పడేసినట్టు అవతల వరండాలో ఆకు వేసి ఇంత ముద్ద పడేస్తే... ఛీ వాళ్ళకు సిగ్గులేదు కానీ తినడానికి నీకెలా సిగ్గు లేకుండాపోయింది? అస్సలు ఎందుకలా పెడ్తున్నారు? ఎప్పట్నుంచీ పెడ్తున్నారు? చెప్పు". ఆయనలా కళ్ళెర్రజేసి గద్దించేసరికి ఆవిడకి ఏడుపొచ్చేసింది.

"అది కాదండీ... మీ పెద్దనాన్నగారి పెళ్ళాం చెల్లెలి కూతురికి... అదే చూడామణికి.... పునర్వివాహం చేశారు కదా.. అప్పట్నుంచి...." అంది భయంభయంగా.

రామానుజస్వామిగారు ఆశ్చర్యపోయారు.

"అదేమిటి? దాని పెళ్ళికీ, నీకు నడవలో అన్నం పెట్టడానికీ ఏమిటి సంబంధం?"

"మొగుడు చచ్చిపోయిన ఆడదానికి మళ్ళీ పెళ్ళి చేయడం మన ఇంటా వంటా లేదు. మన వైష్ణవత్వం మంటగలిపేశారు మీ అత్తవారు. ఎంత చదువుకుంటే మాత్రం ఇలాంటి అప్రాచ్యపు పన్లు చేయడానికని మనసెలా ఒప్పింది? అన్నారు మా కక్కగారు. చూడామణి పెళ్ళి అయిన దగ్గర్నుంచి అలా చేస్తున్నారు..." అంది ఆవిడ బెదిరిపోతూనే.

"దానికి పెళ్ళిపీటల మీద ఇంకా పుస్తె కట్టేడో లేదో వాడు హరీమన్నాడు. ఓ కాపురమా, మంటిగడ్డా! అలాంటిదానికి పెళ్ళి చేసి తిరిగి కొత్త జీవితాన్నిస్తే 'పోనీ పది కాలాలపాటు చల్లగా వుండనీ' అని దీవించాల్సిందిపోయి వాళ్ళ వైష్ణవత్వం మంటగల్సిపోయిందటనా? కన్న కూతురికి నడవలో అన్నం పెడతారా? వెళ్ళి అడుగుతాను వుండు" వింటిన విడిచిన బాణంలా మరో మాట మాట్లాడకుండా ఆయన చెప్పులు తొడుక్కుని విసవిసా అవతలకి వెళ్ళిపోయాడు.

అత్తగార్నీ, మావగార్నీ నించున్నపాళంగా దులిపి విడిచిపెట్టారు. అప్పట్నుంచి ఆయన సుభద్రమ్మగారిని వాళ్ళ పుట్టింటికి పంపించడం మానేశారు. కొన్నాళ్ళకి ఆవిడ తల్లిదండ్రులే కాస్త తగ్గి (మమకారం చంపుకోలేక) అల్లుడింటికి వచ్చి కూతుర్ని పంపించమని కోరారు. రామానుజస్వామి అలాంటి విషయాల్లో మొండి మనిషి.

"మీరు నా భార్యకి నడవలో భోజనం పెడితే మాత్రం నేను ససేమిరా పంపించను" అన్నారు మొండిగా.

ఆఖరికి సుభద్రమ్మగారి తండ్రి అల్లుడి దగ్గర సరేనని ఒప్పకుని కూతుర్ని ఇంటికి తీసుకెళ్ళి, నిప్పలో ఎర్రగా కాల్చిన అట్లకాడతో సుభద్రమ్మగారి నాలుక మీద వాతపెట్టి, ఆవు పేడ తినిపించి శుద్ధి చేసినట్టుగా తృప్తిపడిపోయి వంటింట్లోకి తీసుకెళ్ళారు. పాపం ఆ ఇల్లాలు నోరు మెదపకుండా భరించింది. భర్తతో అదంతా చెప్పలేదు. చెప్తే ఎంత రాద్ధాంతం అవుతుందో ఆవిడకి తెల్సు... జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటీ జ్ఞాపకం రావడంతో ఆవిడ మనసంతా చేదు తిన్నట్టుగా అదోలా అయిపోయింది.

ఆ రోజుల్లో కందుకూరి వీరేశలింగంపంతులుగారు స్త్రీ పునర్వివాహం కోసం ఎంత కృషి చేసినా, పునర్వివాహం చేసుకున్న స్త్రీని ఏదో వింత జంతువుని చూసినట్టు చూసేవారు. కానీ అప్పటికీ– ఇప్పటికీ ఎంత తేడా! ఇప్పుడు ఎవరింట్లోనో ఎందుకు! తన ఇంట్లోనే... తన కళ్ళముందే... తన మనవడే అలాంటి పెళ్ళి చేసుకుంటూంటే అందరూ హాయిగా దీవిస్తున్నారు. ఇది నిజం! ఎక్కడో జరిగితే తను చచ్చినా నమ్మి వుండేది కాదు. కాని తన కళ్ళముందే జరుగుతున్నా ఈ పెళ్ళిని అందరూ ప్రోత్సహిస్తున్నారే! అభినందిస్తున్నారే! ఎవరూ వెలివేస్తామని అనలేదే! పైగా వచ్చినవాళ్ళంతా (కొద్దిమందైనాసరే) సునీతతో కూడా హాయిగా మాట్లాడుతున్నారే! అవును. వాళ్ళంతా సంస్కారవంతులు! పెళ్ళాం చనిపోయిన మూణ్ణెళ్ళకే మగాడికి మళ్ళీ పెళ్ళి చేసుకునే అర్హత కల్పించిన ఈ సమాజం ఇప్పుడు స్త్రీకి కూడా అదే అర్హత నిచ్చిచేయూతనిస్తోంది. కథల్లోనూ, సినిమాల్లోనూ చూపిస్తున్నట్టుగా మాత్రం తమ చుట్టూ వున్న వాతావరణం లేదు. ఎక్కడో, ఎవరో సంకుచిత మనస్తత్వం వున్నవాళ్ళు, ఇతరులు సంతోషంగా వుంటే ఓర్వలేనివాళ్ళు, స్వార్థపరులు, పునర్వివాహం చేసుకున్న అమ్మాయిల్ని లేనిపోని మాటలతో హింసిస్తారేమో. కాని అది ధర్మం కాదు. మగాడికో న్యాయం. ఆడదానికో న్యాయం అనకుండా స్త్రీ పునర్వివాహాన్ని సమాజం సంపూర్ణంగా ప్రోత్సహించినప్పడే నిజమైన సమాజ పురోభివృద్ధి కలిగింది అని అనుకోవాలి. తన కొడుకు, కోడలు, కూతుర్లు, అల్లుళ్ళు అందరూ సంస్కారవంతులైనందుకు ఆవిడకి నిజంగా చాలా గర్వంగా వుంది. ఇంతమంది సంస్కారవంతుల మధ్య వున్న తను మాత్రం ఎందుకు ఇంకా పాత పద్ధతిలో ఆలోచించాలి? వాళ్ళ మనసులకి కష్టం కలిగించకుండా మసలుకుంటే తన పెద్దరికం నిలబడుతుంది. అది తనకీ–వాళ్ళకీ కూడా మర్యాదే!

కానీ ఆవిడ మనసులో పెద్ద సందేహం మిగిలిపోయింది. తన కళ్ళముందే స్త్రీని ఇంత గౌరవంగా చూస్తున్నారు కదా. మరి స్త్రీకి విలువనివ్వడం లేదని, నానాటికీ స్త్రీ పరిస్థితి దిగజారిపోతున్నదని చాలామంది ఎందుకనుకుంటున్నారో ఆవిడకి ఎంత చేసినా బోధపడలేదు. ఆవిడకి మాత్రం ఖచ్చితంగా అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా కనిపిస్తున్నది.

"అత్తయ్యగారూ! అందరికీ హాలులో వడ్డించేస్తున్నారు. ఎప్పటిలాగే మీకోసం వేరేగా ఇక్కడికి మడిగా తెచ్చిమ్మంటూరా?"

సుభద్రమ్మగారు ఏదో నిశ్చయానికొచ్చినదాన్లా లేచింది.

"పదమ్మా. నేను కూడా మీ అందరితోపాటే భోంచేస్తాను".

అలివేలు నమ్మలేనట్టుగా అత్తగారి ముఖంలోకి చూస్తూవుండిపోయింది. ◆

స్వీట్ సెన్సేషన్
అతి త్వరలో కొత్త సీరియల్